# వినతా విజయం




కుసుమ కె. మూర్తి

"వినూ్నా నా మాట వినమ్మా! బి.యెస్సీతో చదువాపెయ్యితల్లీ! మొన్న టిదాకా పరీక్షలని క్షణం విరామంలేకుండా చదివి చదివి ఎంత చిక్కిపోయావమ్మా! ఎనిమిది పౌన్లు తగ్గిపోయావంటే ఎంత బెంగపెట్టుకు పోయానేఅమ్మా నీకోసం. నువ్వేఃఏన్నా ఉద్యోగాలు చెయ్యాలా? ఊళ్ళేలాలా? కట్టుకుపోయేంత ఆస్తి ఉంది. మనమే పదిమందిని పోషించగల సమర్థతఉంది. ఎందుకల్లా చదువు చదువని పాకులాడి శరీరాన్ని మనుస్సుని కష్టపెట్టుకుంటావు? బావకేంలే! ఏదో అంటుంటాడు, 'దిగుదిగు అనేవాళ్ళకాని తోడుదిగేవాళ్ళుండరు' అజమాయిషీ

చేస్తూ ఉన్న ఆస్తిని కాపాడుకుంటే చాలదా? హాయిగా పెళ్ళిచేసుకుని ఒక ఇంటిదానివై నాకో మనవణ్ణి, మనమరాల్ని ఇయ్యవా? నేను పెద్దవాణ్ణయిపోతు న్నాను ఓపిక, ఓర్పు తగ్గిపోతున్నాయి. విశ్రాంతి తీసుకోవాలనిపిస్తోంది. ఏమ్మా మాట్లాడవేం"?

"ఫో నాన్నా! నాకు చదువుకోవాల నుంది, చదువుకుంటాను. ఉద్యోగం చేయటం తరువాత సంగతి. కొందరికి క్లాసురాక, కొందరికి డబ్బులేక కొందరికి ఆరోగ్యంలేక కొందరికి ఇంకోవిధంగా పరిస్థితులనుకూలించక చదవరు-అన్నీఉండి నాకేంఖర్మ. మార్కు లొచ్చాయి, డబ్బుంది, చదవగలశక్తుంది చదివి తీరతాను"

"నువ్వంతా మీ అమ్మపోలిక. ప్రతి విషయంలోనూ నీ పట్టేనెగ్గా లంటావు. పోన్లే చదువుకో నీ యిష్టం. కాని ఒక కండిషన్. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి. రాత్రిళ్ళు ఎక్కువసేపు మేలుకుని చదువకూడదు. ఒక్కగ్రాము బరువు కూడ తగ్గకూడదు. ఈ నిబంధ నలని దాటావో మరుక్షణం నీ చదువాగి పోతుంది.''

"ఓ! మా నాన్న మంచి'' అంటూ ఆయనచేతులు పట్టుకుని గిరగిర తిరుగు తుంది వినత, పురుషోత్తమరావుగారి ఏకైక పుత్రిక. ఏమిటేమిటివిశేషం? తండ్రికూతుళ్ళు ఒప్పలకుప్ప ఆడుతున్నా రేమిటి?''-అప్ప డేలోపలికొస్తున్న ఉపేం దర్ ఉవాచ.

"మా నాన్న నేను ఎం. ఎస్సీ. చదవ టానికి ఒప్పుకున్నారు బావా.''

''ఒహో! కన్‌గ్రాట్స్!-అయినా మామయ్య నీమాట కాదన్నది మాత్రం ఎప్పుడులే! ఒక్కగారాబాల కూతురివిగా అందులో........."

''ఊ,-అందులో తల్లిని పోగొట్టు కున్నదాన్నిగా!-అదినాకోపెద్ద ఎడిష నల్ క్వాలిఫికేషన్. అనుబావా! నువ్వు కూడా అను. అవును నామాట నాన్నెం దుకుకాదంటారు?"

''నేనలా అనలేదుగా. ఎందుకలా నిష్ఠురంగా మాట్లాడతావు? ఎవరో నిన్ను విమర్శించారని ఎవరు కనపడితేవాళ్ళతో పోట్లాడుతే ఎల్లా? గిల్లికజ్జాపెట్టుకోవడం నీకలవాటసలు. ఇదుగో నత్తా! అనవ సరంగా నాతోపోట్లాడద్దు. ఊరుకోను చెప్తున్నా! అసలే ఈ బావ మంచివాడు కాడు" అన్నాడు ఉపేందర్.

''ఇదుగో ఉప్పుబావా! నన్ను నత్తా గిత్తా అని చెత్తగాపిలవద్దని చెప్పలా. నన్ను పూర్తిగా వినతా! అని పిలు. ఓపికలేక పోతే విన్నూ అని పిలు.''

బావుందోయ్! కొందరు వినతలో మొదటి రెండక్షరాలు పిలుస్తే నేను చివరి రెండక్షరాలు పిలుస్తా. అంతా నీ ఇష్టమేనా?" నవ్వేసాడు ఉపేందర్. గాలివానగా మారుతుందనుకున్న వాతా

వరణం చల్లని చిరుజల్లుగా మార్చిన మేనల్లుడికేసి కృతజ్ఞతతో చూస్తూ వెళ్ళిపోయారు పురుషోత్తమరావుగారు.

"అదిసరేకాని బావా' నేను జెనెటిక్స్ యం. ఎస్సీ. యే చదువుదా మనుకుంటున్నా. కాస్త నీ గైడెన్స్ కూడా ఉంటుంది ఏమంటావ్?"

"ఏమంటాను? నీ ఇష్టం అంటాను. చదివించు మామయ్యా అన్నాననే మీ నాన్న నామీద విసుక్కున్నాడు. జెనెటిక్స్ సైన్స్‌లో క్రొత్త బ్రాంచ్ గదా? చాలా కష్టపడి చదవాలి. తప్పకుండా నా శాయశక్తులా హెల్ప్ చేస్తాను. నా బుక్స్-అన్నీ నీకే ఇస్తాను. ఇది కొత్త డిపార్ట్‌మెంట్ కనుక, బాగా ప్రాస్పెక్ట్స్ ఉంటాయి. ముందుముందు బాగా అభివృద్ధిలోనికి రావచ్చు. వెధవ-అల్లిక! ఎప్పుడూ ఏదో అల్లుతూ ఉంటావు. అవతల పారెయ్! లేదా నేనే గిరవాటు కొడతాను. అన్నయ్యా, వదినా, అక్కయ్యా ఇంట్లో రెడీగా ఉన్నారు. ''విన్నాని తీసుకురా సినిమాకి పోదాం"-అన్నారు. పద పద. టైమ్ఐపోతోంది.'' తొందరపెట్టాడు ఉపేందర్.

"నీకే స్వెటరల్లుతున్నాను బావా!" అంటూ పక్కనపెట్టి అతనితో బయలుదేరింది.

తల్లిలేని పిల్ల ఎక్కడ ఒంటరితనం తట్టుకోలేదేమోనని తండ్రి, మేనత్త, బావలు ముఖ్యంగా ఉపేందర్ ఆమెని క్షణంకూడ ఒంటరిగా ఉండనివ్వరు. ఎప్పుడూ సినిమాలకో, పిక్నిక్‌లకో, ఎగ్జిబిషన్ రోజుల్లో అక్కడికో, ఏమీ తోచకపోతే టాంక్‌బండ్‌కో, స్నేహితుల ఇళ్ళకో రోజుకో ప్రోగ్రాం వేసుకుని తీసుకువెళ్తుంటారు. ఒంటరిగా ఉన్నప్పుడుమటుకు తల్లిలేని దిగులు వినత ముఖంలో కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ఆ కొరత తీర్చటానికే-అందరు-అనుక్షణం ప్రయత్నిస్తుంటారు.

సినిమానించి వచ్చి తండ్రితో భోంచేసి తన గదిలోపడుకుంది. 'బావ ఎంతమంచివాడు? ఎన్ని వింతలు విశేషాలు చెబుతాడు! విసుగు, విరక్తి తనలో చోటుచేసుకోకుండా కాపలా కాస్తుంటాడు. తన మూడ్స్ బాగాలేకపోతే మాటల్లోపెట్టి నవ్వించి మరీ వదుల్తాడు. సీరియస్‌గా ఉండడు, ఉండనియ్యడు. అసలు సీరియస్‌నెస్ అనేపదమే బావ, డిక్షనరీలోలేదు. వినుదలు, వినోదాలతో క్షణంతీరిక ఉండనివ్వడు. బావ లేకపోతే తన బతుకేంకాను! తోబుట్టువులు లేక, తల్లి లేక తల్లడిల్లిపోతుంటే తనని బావ ఎంత బాగా మరిపించి మురిపిస్తాడు. ఎల్లా కవ్వించి, నవ్వించి ఏడిపిస్తాడు! తన జ్ఞానపుష్పం వికసించటానికి పుస్తకాలకన్నా బావే ఎక్కువ తోడ్పడ్డాడు. బావ సమక్షంలో తను సర్వస్వం మరిచిపోతుంది.' ఏవో మధురాను

భూతులను పొందుతూ హాయిగా నిద్రా దేవి ఒడిలో వాలిపోయింది విరజాజి లాంటి వినత.

*　*　*

"నీకు తెలీదమ్మా, నేను చదువుకున్న సైన్స్ పేరు జెనెటిక్స్.- అంటే వంశ పారంపర్యంగా వచ్చే మంచిగుణాలు, రోగాలు, ఇలాంటి వెన్నో విషయాలు నేర్చుకున్నాను. మేనరికాలు-అసలు చేసుకోకూడదని ఆ సైన్స్ చెబుతుంది. తెలీక నాన్న నిన్ను మేనరికంచేసు కున్నారు. మళ్ళీ తెలిసీ నేను విన్నీని చేసుకోనా! కుదరదమ్మా! ఫస్ట్‌కజిన్‌ని చేసుకోవట మంటే నాకు భలేచిరాకు. విన్నీ-అంటే నాకెంతో ఇష్టం. అది బోలెడంత ఆస్తిఉన్న మామయ్యకి ఒక్కగానొక్క కూతురని తెలుసు. కాని బ్రిడ్జన్ ఏంచెప్పా డంటే......

"నీ మొహంచెప్పాడు. మేనరికాలు చేసుకోవద్దని సైన్స్ చెప్పటమేమిటిరా?- అసలదేం చదువంట? ఈ చదువు చది వాక నీకున్న వివేకం పూర్తిగా పోయిందిరా. మామయ్య నీమీద కొండంత ఆశ పెట్టుకున్నాడు. రూపంలేదనా? ధనం లేదనా? చదువు లేదనా? ఏ వంకఉందని నా కూతుర్ని చేసుకోరు - అని- అడిగితే మామయ్యకి ఏంజవాబు చెప్పాలిరా? అసలు మీనాన్న నేను మామయ్యకి మొహం ఎల్లా చూపించము? పాపం తల్లిలేనిపిల్ల. నువ్వంటే పంచప్రాణాలు దానికి. విన్నీ మనసు వెన్నరా?" సత్యవతమ్మ నచ్చ చెప్పపోయింది.

"మీరిద్దరూ మొహాలు చూపెట్టక పోతే ముఖాలకి నల్లగుడ్డ చుట్టేసుకోండి. ఇదుగో అమ్మా నేనిదే చెప్తున్నా. నింగి నేలకొచ్చినా నేల నింగినంటినాసరే నేనీ మేనరికం మటుకు చేసుకోను. విన్నీ మామయ్య కూతురు కాకుండా ఉంటే తప్పకుండా చేసుకునేవాణ్ణి. ఈ విష యంలో ఎప్పుడో ఒక నిర్ణయానికి వచ్చాను. నన్నింక బలవంత పెట్టద్దు. దానికి మించిన సంబంధం తెచ్చి పెళ్ళి చేసే పూచీనాది. దానికి పెళ్ళికాదనా? నాకు పెళ్ళి కాదనా, నీ దిగులు?".

కాసేపటిక్రితం వచ్చి వరండాలో కూర్చుని ఇదంతా విన్నూ విన్నదని వాళ్ళిద్దరికీ తెలియదు. ఎల్లా వచ్చిందో అల్లాగే తిరిగి పోదామని లేచి రెండడు గులు వేసింది. "హల్లో! విన్నీ రా. లోపలికి వెళ్ళిపోతున్నావేమిటి? ఎంత సేపైంది వచ్చి?". విన్నూ ఇదంతా విన్న దని తెలిసి ముఖం చూపించటం ఇష్టం లేక సత్యవతమ్మగారు వంటింట్లోకి వెళ్ళి పోయింది. "చూడు విన్నూ మనిద్దరం పెళ్ళి చేసుకోవాలిట. జెనెటిక్స్ ప్రకారం మేనరికాలు చేసుకోకూడదుకదా? ఈ ఓల్డర్ జనరేషన్ వాళ్ళకి ఏమీతెలీదు. చాదస్తం. పాతకాలపు పద్ధతులూ తప్ప. శరీరంలో ఉండే సెల్స్, సెల్స్‌లో ఉండే న్యూక్లియస్‌లు, న్యూక్లియస్‌లో



క్రోమోజోమ్స్, క్రోమోజోమ్స్‌లో ఉండే జీన్స్, జీన్స్‌లో ఉండే డి. ఎన్. ఏ., డి. యన్. ఏ. లో ఉండే నాలుగు ఏసిడ్స్, పాస్ఫేట్ రాడికల్సూ డీ ఆక్సీ రైబోస్ షుగరూ ఇవన్నీ ప్లేచేసే ట్రిక్కులూ, వంశపారంపర్యంగా ఇవి ఎల్లా దిగుమతి అవుతాయి, ఇవన్నీ వీళ్ళ కేం తెలుస్తాయి. హాట్సాఫ్టు జెనెటిక్స్ అండ్ జెనెటిసిస్ట్స్ : హీమోఫీలియా, షిజోఫ్రెనియా, కలరుబ్లైండ్‌నెస్ లాంటి రోగాలకి మేనరికాలే కారణమని వీళ్ళ కెల్లా నచ్చచెప్పాలి ? విన్నీని చేసుకో, విన్నీని చేసుకో అని తెల్లారిలేచింది మొదలు చెవిలో ఒకటేరొద. వీళ్ళంద రికి ముఖ్యంగా అమ్మకి జెనెటిక్స్ యం.ఎస్సీ. చెప్పించేస్తేసరి. గోలవదలి పోతుంది". ఎమోషనల్‌గా చెప్తున్నాడు.

విన్నీ నవ్వింది. గట్టిగా నవ్వింది. కాని అందులో అందంలేదు. జీవంలేదు. విషాదంగా నవ్వింది. బాధగా నవ్వింది. "అవును అత్తయ్యా బావ చెప్పింది నిజం. మేనరికాలు పనికిరావు. ఎంత దూర సంబంధం చేసుకుంటే అంత ఆరోగ్య మైన సంతానం కలుగుతుందని సైన్స్ చెబుతోంది". నూతిలోంచి మాట్లాడు తున్నట్టుంది ఆమె స్వరం.

"బాగుందమ్మా తగ్గమేళం కొయ్య తాళం అన్నట్టుంది మీ యిద్దరి పని". అని పైకి అంది కాని వినత ముఖంలో నీలినీడలు చోటుచేసుకోవటం ఆవిడ గమనించక పోలేదు. "నిండుకుండ తొణకదు. ఇందులో మటుకు [అన్నయ్య పోలిక" అనుకుంటూ ఉండిపోయింది.

ఇంటికెళ్ళిన వినత దిండులో తల దూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది. ఆయా ఎంత బతిమాలినా అన్నం తినలేదు. తండ్రి ఎంత పిలిచినా తలుపు తియ్యలేదు. "ఛీ! బావ నాకు ఎందుకు మేనత్త కొడుకయ్యాడో! ఈ జెనెటిక్స్ బావ చదవకపోయినా బావుండేది. ఎందుకీడబ్బు, హోదా, కార్లు, ఇల్లు, తోటా, అందం, చదువు! అన్నీ దండగ. హాయిగా పల్లెటూరి పేదవాళ్ళుగా పుట్టినా నాబావ నాకు దక్కేవాడు. ఈ చదువు చదవకపోయినా నా బావ నన్ను పెళ్ళి చేసుకునేవాడు. సైన్సు ముందు ప్రేమ తల వంచాల్సి వచ్చింది. నాకు వేరే మంచి సంబంధం తెచ్చి పెళ్ళి చేస్తాట! నేనసలు పెళ్ళే చేసుకోను. బతికున్నంత కాలం కన్యగానే ఉండిపోతాను. బావతో పెళ్ళికాకపోతే నాకసలు పెళ్ళే వద్దు. చిన్నప్పటినుంచి ఎంత ప్రేమించాను బావని? తను లేకపోతే నాకొక్క రోజు గడవడమే ఎంతో కష్టం. నామనస్సులో బావకి తప్ప మరెవ్వరికి చోటులేదు ఉండబోదు. బావ మనస్సులో నాకు తప్ప ఎవ్వరికీ చోటు లేదనుకున్నాను. ఛీ! జెనెటిక్స్ పేరు చెప్పి ఇంకెవరినైనా చేసుకుందామని, నన్ను వదుల్చుకుందామని ప్లానేశాడేమో! అసలెవర్నన్నా ప్రేమించాడేమో"! ఇంక ఆలోచించలేకపోయింది. గుండె నెవరో చీల్చినట్లయింది. కష్టంమీద కలత నిద్దర పోయింది.

ఒకరోజు ఒకావిడ సత్యమ్మగారింటికొచ్చింది. ఎంతో సంబరంగా ఇల్లంతా చూపిస్తోంది, తన చిన్ననాటి స్నేహితురాలికి. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఏవో అల్లరికి ఒక చెంచా తీసుకుని రెండో చేతిలో ఉన్న పళ్ళానికి టాంగ్ టాంగ్ కొడుతున్న కొడుకుని చూపించి మూరెండోవాడు. నాలుగేళ్ళ కుర్రాడు నయం వీడికన్నా" అంటూ పరిచయం చేసింది ఆవిడ. వచ్చినావిడ ముసిముసి నవ్వులు నవ్వుతూ "అట్లా కొందరు సరదాగా అల్లరి చేస్తారు సత్యవతీ, ఏం చదువుతున్నాడు?" అనడిగింది. "వీడా! మేనరికాలు చేసుకోకూడదు, అని అదేదో కొత్తసైన్స్ చెబుతున్నారట. ఆ చదువు పూర్తిచేశాడు పైగా ఫస్టుక్లాస్‌లో పాసయినాడు." అన్నది సత్యవతమ్మ మహావెటకారంగా.

"ఏం అల్లా అనకపోతే జెనెటిక్స్ ఎం. ఎస్సీ. పాసయానని చెప్పరాదూ!" విసురుగా వెళ్ళిపోయాడు ఉపేందర్.

* * *

"నేను బొంబేకు ట్రైనింగ్‌కి వెళ్త




న్నాను విన్నీ. రెండేళ్ళల్లో అయిపోతుంది. బాగా చదువుకో. క్లాస్ తెచ్చుకోవాలి. నీకు లేటెస్ట్ జర్నల్స్ ఏవన్నా పంపిస్తా. వుత్తరాలు రాస్తూండు. గుడ్ లక్".

"థాంక్స్ బావా! హేపీజర్నీ ఎండ్ గుడ్‌లక్".

మర్నాడు ఉపేందర్ ప్లేన్ ఎక్కుతుంటే తల వెనక్కుతిప్పి రహస్యంగా కళ్ళు తుడుచుకుంటున్న వినతని సత్యవతమ్మ ఒక్కతే చూసినట్టు మరెవ్వరికీ తెలీదు. అక్కని, అన్నని, వదినని, మామయ్యని, అమ్మని, నాన్నని చూడకుండా విన్నూనే చూస్తూ చెయ్యి ఊపుతూ ప్లేన్ ఎక్కబోతున్న కొడుకుని పరిశీలనగా చూసి అంతదూరాన్నుంచే ఏవోభావాలు చదువుతోంది సత్యవతమ్మ గారు!

కాలప్రవాహంలో మరొక కాలెండర్ కొట్టుకుపోయింది. 'అమ్మ ఎన్నాళ్ళకి ఉత్తరం వ్రాసింది! అనుకుంటూ ఆత్రంగా చదువుతున్నాడు.

"చిరంజీవి ఉపేన్‌ను మీ అమ్మ ఆయురారోగ్యఐశ్వర్యాభివృద్ధిగా దీవించి వ్రాయునది. నీఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. జవాబు వెంటనే వ్రాయలేకపోయినందుకు అమ్మమీద కోప్పడకు. పెళ్ళి దగ్గరపడుతోందికదా! ఆ హడావిడిలో ఉన్నాను. అన్నట్టు ఎవరి పెళ్ళో నీకు తెలీదు కదా! మొన్నీమధ్య మామయ్య నన్ను గట్టిగా నిలేసి అడిగాడు. "ఉపేన్‌కి విన్నేని చేసుకోవా" అని. అంతకన్నాగట్టిగాచెప్పేశాను. చేసుకోను, మేనరికాలు పనికిరావు అని సైన్స్ చెబుతోంది. నాకొడుకూ అదే చదువు చదివినాడు., నీకూతురదే చదువు చదువుతోంది" అనిచెప్పాను మామయ్య ఏమాత్రం బాధపడలేదు. పైగా, అవును నిజమే. అన్నీమన మంచికే. దానికి వేరే సంబంధం చూస్తాను'' అన్నాడన్నయ్య.

విన్నూ కూడా అభ్యంతరపెట్టలేదు. దానికి మంచి సంబంధం చూశారు. ఖాయం చేశారు. ఒక వారంలో తాంబూలాలు పుచ్చుకుంటున్నారు. విన్నీ చాలా సంతోషంగా ఉంది. ఈ పదినెలల్లో కొద్దిగా లావైంది. అప్పుడే దానికి పెళ్ళికళ వచ్చేసింది. ఇంకో రెండు నెలల్లో పరీక్షలవుతాయట. ఈ వేసంగిలో పెళ్ళిచేస్తారట. "బావని పెళ్ళికితప్పకుండా రమ్మని వ్రాయి అత్తయ్యా" అంది. అది నీకుఉత్తరాలు వ్రాస్తూనే ఉందికదా! కాని అందులో తన పెళ్ళి విషయం వ్రాయటానికి సిగ్గుపడుతోంది పిచ్చిపిల్ల. ఇంక హడావిడి అంతానాదేను. తాంబూలాలప్పటికి రాలేకపోయినా పెళ్ళికితప్పకుండారా! మామయ్యకు మాత్రం ఎవరున్నారు? అంతా మనమే చెయ్యాలి. మామయ్యా, నాన్న నీకు ఆశీస్సులని వ్రాయమన్నారు. నువ్వెళ్ళి యేడాది దాటింది. పెళ్ళికి తప్పక రా!

అనేకదీవనలతో

ఇట్లు మీ అమ్మ

ఉత్తరం చదవిన ఉపేందర్‌కి గుండెల్లో ఉరుముతున్నట్టనిపించింది. ఏమిటీ! విన్నీకి పెళ్ళా! ఎవర్నో చేసుకుంటోందా? పైగా సంతోషంగాఉందా? ఇంకా పైగా లావైందా? నేను పెళ్ళికెళ్ళాలా? "జెనెటిక్స్ లేదు నీ మొహం లేదు? వెర్రివేషాలెయ్యకు బావా! చిన్నప్పటినించి మనం ఒకళ్ళనొకళ్ళం ఎంత గాఢంగా ప్రేమించుకున్నాం. నిన్నగాక మొన్న వచ్చిన ఈ జెనెటిక్స్ మనని వేరుచేస్తుందా? అని ఒక్క అరుపు అరిస్తే నేను నీ మాట వినేవాణ్ణి కానా విన్నీ?! అమ్మో విన్నూ ఇంకొకడి సొత్తు అయిపోతుందా? పాతెయ్యనూ వాణ్ణి! వాడెవడు? నావిన్నీని చేసుకోవడానికి. చేసుకోవడం వదిలెయ్. కన్నెత్తి నా విన్నీని చూడ్డానికి, పన్నెత్తి దాంతో మాట్లాడ్డానికి వాడికెన్ని గుండెలు? ఆ కళ్ళు పీకెయ్యనూ! ఆ పళ్ళు రాలగొట్టనూ! నిలువునా చీరేస్తా వెధవని! అమ్మ ఎంత మంచిది. ముందుగానే తెలియపరిచింది. లేకపోతే! లేకపోతే! తిన్నగా శుభలేఖే పంపేవారేమో! ఛీ! విన్నీకి నేనంటే ప్రేమలేదా! ఎల్లా ఒప్పుకుంది ఇంకొకణ్ణి పెళ్ళిచేసుకోటానికి. ఎంత అన్యాయం? ఎంత ద్రోహం? ఎంత మోసం? హయ్యో! విన్నీని తిట్టుకోటమెందుకు? తప్పంతా నాదే. నేనేగా చేసుకోనూ, చేసుకోనూ అని గట్టిగా చెప్పింది. నేను నిన్ను పెళ్ళి చేసుకోను. నువ్వెవర్నీ చేసుకోవద్దంటే ఎల్లా? కాదు, విన్నీ నాది. ఎవరికీ దక్కనివ్వను. విన్నీమీద ఎవరికీ హక్కులేదు! ఉండబోదు! సర్వహక్కులు నావి. ఎవడు కాదంటాడో చూస్తాను. అది పుట్టగానే "నీకు పెళ్ళాం పుట్టిందిరా" అన్నారుట అందరూ. ఇప్పుడది ఇంకోడి కెళ్ళా పెళ్ళామవుతుంది? కానీ...కానీ... జెనె

టిక్స్! సెల్స్, న్యూక్లియస్‌లు, క్రోమో జోమ్స్, జీన్స్, డి.ఎన్.ఏ.లు ఫాస్ఫేట్ రాడికల్స్, డీఆక్సీరైబోస్, షుగరూ! అరే ఇవన్నీ రంగులుపూసుకుని తన చుట్టూ ఇలా నాట్యం చేస్తున్నాయేమిటీ? తనను వెక్కిరిస్తున్నాయేమిటి? అలా విరగబడి నవ్వుతున్నాయేమిటి? ఏమిటీ విచిత్రం? ఏమిటీ విపరీతం? "ఛ! నోర్ముయ్యండి వెధవల్లారా! వెధవ డాన్సులూ మీరూను. ఫోండిఇక్కణ్ణించి. ఒక్కక్షణం ఉన్నారంటే ఛంపేస్తాను. విన్నీ నొదిలిపెట్టి నేనెలా బతగ్గలనను కున్నారు? మేనరికం చేసుకుని మా తాత సుబ్బరమైన పిల్లల్ని కనలా! వాళ్ళకేం మెంటల్ రిటార్డేషన్ లేదే! వాళ్ళకేం ఇడియసీ లేదే! మా అమ్మ మేనరికం చేసుకోలా! మేమంతా నిక్షేపంలా లేమూ! మాకేం హీమోఫీలియా లేదే! కలర్ బ్లైండ్‌నెస్ లేదే! మామయ్యా మేన రికం చేసుకోలా? కుందనపుబొమ్మలా అందంగా ఆరోగ్యంగా ఏ రోగాలు లేకుండా విన్నీ లేదూ! అదంతా గీతలో ఉందిగాని మేనరికాల్లో ఏముంది? మళ్లీ మీరంతా నా కెప్పుడైనా కనపడి నా విన్నీని నాకు దూరంచేశారో మిమ్మల్ని, మిమ్మల్ని చూపెట్టిన ఆ మైక్రోస్కోప్ లతో సహా నాశనంచేసేస్తాను జాగ్రత్త." కత్తిదూసి మనస్సులోనే శత్రుసంహారం చేసి రాకుమారిని దక్కించుకునే రాకుమారుడిలా అర్జంటుగా బయటికి వెళ్ళి తల్లికో టెలిగ్రామ్ పారేసివచ్చాడు. "స్టార్టింగ్ ఇమీడియట్లీ-ఉపేన్." ప్రేమ ముందర సైన్స్ తలవంచాల్సిందే. ప్రేమ జెనెటిక్స్‌నే జయించింది. పదేపదే అను కుంటూ ఎన్నో మధురానుభూతులతో, ఎంతో సంతోషంతో సన్నగా ఈలవేసు కుంటూ మర్నాడు రైలెక్కాడు.

"విన్నూ బావ వస్తున్నాట్ట! టెలిగ్రాం ఇచ్చాడు". భావయుక్తంగా నవ్వింది సత్యవతమ్మ. వినత మొహం కాంతి వంతమై అంతలోనే కళతప్పింది. "అవును, నిన్నూ మామయ్యాని, బావనీ, అక్కయ్యనీ, వదినెనీ చూసి చాలా కాల మైంది కదా!" బాధగా అంది వినత.

"మమ్మల్ని చూడ్డానికి అంత అర్జం టుగా టెలిగ్రామిచ్చివస్తాడటే విన్నమ్మా!" ఆమె మాటలు అర్థంగాని వినత "రేగి చెట్టుకింద గుడ్డివాడు నవ్వినట్టు" నవ్వింది.

ఆ తరవాత ఆవిడేం చెప్పిందోగాని కళ్ళనీళ్ళు వచ్చేటంత నవ్వుతోంది వినత. మరునాటికల్లా రానేవచ్చాడు ఉపేందర్. "ఏడాదినుంచి రానివాడివి ఇప్పుడేమంత కొంపలంటుకున్నాయని అల్లా ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇచ్చి ఊడిపడ్డావుతా! ఆరోగ్యం బాగాలేదా!" వస్తున్న నవ్వుని నొక్కిపెడుతూ అడిగింది ఆవిడ.

"ఆరోగ్యానికేం బాగానేఉంది కాని వెంటనే విన్నూని చూడాలమ్మా" మాట కన్నా ఒగుర్పు ఎక్కువగా ఉంది.

"ఎందుకూ దాన్ని చూ డ టం! అయినా మనింట్లోనే ఉందిలే. రెణ్ణెల్లలో పెళ్ళవబోతోంది కదా! పరాయి ఇంటి పిల్ల అయిపోతోందని కొన్నాళ్ళట్టిపెట్టు కుందామని నిన్ననే పిలుచుకువచ్చాను."

"ఇక్కడే ఉందా అమ్మా! అయితే విన్నీ ఇంక శాశ్వతంగా ఇక్కడే ఉండి పోతుంది. అది నీ కోడలు. నేను దాన్ని వదిలిపెట్టి ఉండలేను. అదెవర్నీ పెళ్ళి చేసుకోవటానికి వీల్లేదు. ఆ సంగతే మామయ్యతో చెప్పిరా! లేకపోతే నేనే చెప్పివస్తాను" ఆవేశంగా అరుస్తున్నాడు. ఆవిడ చిన్నగా నవ్వుతోంది.

"నవ్వుతావేమమ్మా! ఇంత సీరియస్ మేటర్ అయితేనూ. నీకంతా నవ్వులాటగానే ఉంటుంది. విన్నీ ఏది?"

"అంత కంగారేమిట్రా! అలాచిందులు తొక్కుతున్నావేమిటి?"

మరి జెనిటిక్సో అదేమిటో సైన్స్ అన్నావుగా మరి..."

ఆవిడ మాటలు వినేటందు కెవరున్నా రక్కడ?

ఒక్క అంగలో మేడమీదికి పరుగెత్తాడు.

"టేబుల్‌మీద తలపెట్టుకుని ఏదో చదువుతున్నట్టు నటిస్తున్న విన్నీ దగ్గరికి తుఫానులాగా వచ్చాడు ఉపేన్.

"విన్నీ నేను వచ్చేశాను నీకోసం. ఇంక మనిద్దర్నీ, మనని పుట్టించిన ఆ బ్రహ్మదేవుడు కూడా వేరుచెయ్య లేడు. ఆ సంబంధం కాన్సిల్‌చెయ్యి".

"అదంత తేలికైనపనికాదు బావా! అంతా చెయ్యిదాటిపోయింది. నాన్న నిశ్చయం చేసేశారు. ఇప్పుడు కాదంటే బావుండదు. అవతలవాళ్ళు పెద్దమనుష్యులు. గొప్ప సాం ప్ర దా య మై న కుటుంబం. పెళ్ళికొడుకు మంచి అందగాడు. బాగా చదువుకున్నవాడు. ఫారిన్ రిటర్న్డ్. ఇప్పుడొద్దంటే బావుంటుందా? చచ్చేంత నవ్వొస్తున్నా విపరీతమైన బాధ నటిస్తూ అంది. తోకతొక్కిన తాచులా లేచాడు.


"ఇంక చాలించు. వాళ్ళ బోడి గొప్పలు. అసలు నన్ను చేసుకోవాలనుందా లేదా! ముందీ ఒక్క ముక్క చెప్పు. తక్కినవన్నీ నేను చూసుకుంటాను."

"నువ్వంటే ఇష్టం లేకపోవటమేమిటి బావా! కానీ జెనెటిక్స్ ప్రకారం..."

"ఛీ! ఛీ! జెనెటిక్స్ లేదు. గినిటిక్స్ లేదు. ఆ గొడవ వదిలెయ్. ముందు మామయ్యతో మాట్లాడి వస్తానుండు."

'బావా! బావా' అని పిలుస్తున్నా వినిపించుకోకుండా ఖంగారుగా మేనమామని కలుసుకోడానికి కార్‌లో వెళ్ళాడు.

సత్యవతమ్మగారు, వినతా చెరో గుమ్మం పుచ్చుకుని ఒకటే నవ్వు. గాలి దుమారంలా వచ్చిన ఉపేన్‌ని చూసి అతని మొహంలో ఉన్న క్రోధావేశాలకి




కారణం తెలీక, అవాక్కయి నిలబడ్డారు పురుషోత్తమరావుగారు.

"మామయ్యా విన్నీని నాకిచ్చి పెళ్ళి చేస్తావా లేదా చెప్పు. అది తేల్చుకోటానికే ఇంతదూరం వచ్చాను." ఈత రాని వాడు నీళ్ళల్లో మునిగి బతికి బయట పడ్డట్టు ఒగురుస్తున్నాడు ఉపేందర్.

"నేనెప్పుడు కాదన్నాన్రా! నేనే అడుగుదామనుకుంటున్నా మీ నాన్ననీ, మీ అమ్మనీ."

"మరి ఆ వెధవ సంబంధం వెంటనే కాన్సిల్ చెయ్యి."

"ట్రాంబే వెళ్ళాక నీకు మతి చలించిందేమిట్రా? ఏ వెధవ సంబంధం కాన్సిల్ చెయ్యాలి?"

"అదేమిటి అల్లా అంటావు? నువ్వు విన్నీకి కుదిర్చిన సంబంధం!"

"నేనేమీ కుదర్చలేదే. పైసమ్మంధాలు చూడ్డానికి నాకేం ఖర్మరా నువ్వుండగా. చిన్నప్పటినించి అనుకుంటున్నదేగా విన్నీని నీకిద్దామని. స్వర్గంలోఉన్న మీ అత్తయ్య కోరిక కూడా అదేగా."

"మరి అమ్మ అల్లా ఉత్తరం వ్రాసిందేమిటి?"

"అమ్మేమిటి? ఉత్తరం వ్రాయటమేమిటి? ఏమని వ్రాసింది. అంతా విపులంగా చెప్పు. నాకేం అర్థంకావటంలేదు."

ఉపేందర్‌కి మటుకు కాస్త కాస్త అర్థం అవుతోంది.

"రా మామయ్యా! కారెక్కు, ఇంటికి పోదాం." వినయంఒలకపోస్తూ అడిగాడు.

* * *

"నీ దెంత మంచిమనస్సు అత్తయ్యా! నీకెల్లా థాంక్స్ చెప్పుకోవాలో తెలీటం

లేదు. నా బావని నాకు దక్కించావు. లేకపోతే నాబతుకు ... "కాళ్ళకి దండం పెట్టబోయిన కోడల్ని లేవదీస్తూ "ఛీ! పిచ్చితల్లి. ఎందుకంత పెద్ద మాటలు మాట్లాడతావు. నీ మనస్సు నాకు తెలీదా! వాడి సంగతీ తెలుసు. వాడు వెళ్ళిపోతున్న రోజు నేనిద్దర్నీ గమనిస్తూనే ఉన్నాను. మీరిద్దరూ ఒకర్ని విడిచి ఒకరు ఒక్కక్షణం కూడ గడపలేరు. వాడు లేని ఈ ఏడాదినించి నువ్వెంత చిక్కిపోయావో చూడు. నీ ధ్యాసంతా వాడిమీదేనని నీ పరధ్యానానికి వాడే కారణమని నాకు తెలీదనుకున్నావా? ఇహ వాడి ఉత్తరాలనిండా నీ గొడవే. వాడి సంగతి నాకు మరీ బాగా తెలుసు. ఉత్తి జెలసీ వాడికి. నీతో ఎవరన్నా ఎక్కువసేపు మాట్లాడితే కిట్టేదికాదు వాడికి. అంతెందుకు నీవు నవల చదువుతున్నా స్వెటరల్లుతున్నా ఓర్చుకోలేడు. ఆ ప్రాణంలేనివాటిమీద కూడ జెలసీయే. అదే పైకి లాగాను ఒక్క ఉత్తరంలో. అదే ఉపయోగించుకున్నాను నిన్ను కోడల్ని చేసుకోవడానికి."

స్పీడుగా వచ్చిన కారు ఠక్కున ఆగింది

"ఏం నత్తా! అత్తా కోడళ్ళు కలిసి నన్నేడిపిస్తున్నారా?"

సత్యవతమ్మగారు జరిగినదంతా చెప్తుంటే పురుషోత్తమరావుగారు, ఇంట్లో ఉన్నవాళ్ళందరూ విని ఇల్లు దద్దరిల్లేలా నవ్వుకుంటున్నారు. జంట మేడమీదకి పరుగెత్తారు.

"ఏం నువ్వు నన్నేడిపించలా ఇన్నాళ్ళు. అయినా ఏయ్! ఉప్పుబావా! నన్ను "నత్తా" అననంటేనే నిన్ను పెళ్ళి చేసుకునేది. లేకపోతే ఆ పరాయి సమ్మంధం చేసుకుంటా జాగ్రత్త."

"పరాయి సమ్మంధం చేసుకుంటావా చిట్టి మరదలా! వాడి చర్మం చీల్చి చెప్పులు కుట్టించుకోనూ? నువ్వు నన్ను 'ఉప్పుబావా' అనటం మానెయ్యి, నేను నిన్ను 'నత్తా' అనటం మానేస్తా,సరేనా!"

తన బంధంలో గువ్వల్లే ఒదిగిపోయిన వినతని చూసి "నేనూ నా జెనెటిక్సూ చిత్తుగా ఓడిపోయాము. నా విన్నీయే విన్ చేసింది." బుగ్గకందిపోయేలా తియ్యటి ముద్రవేశాడు ఉప్పు బావ కాదు కాదు ఉపేందర్.

